జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 15 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 6

## ఓసారి ఇటు చూడండి ...

- వార్తల విషయంలో సోషల్ మీడియా ప్రభావం
- అవగాహన లేమితో అభాసపాలవుతున్న వైనం



**భద్రాద్రికొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి :** సోషల్ మీడియా ప్రభావంతో జర్నలిస్టులు కనీస విలువలు బాధ్యతలు పాటించట్లేదనేలా జరిగిన ఓ సంఘటన పలువురు పాత్రికేయలను విస్తుపోయేలా చేసింది. కొందరు పాత్రికేయ మిత్రులు అవగాహనాలేమితో వార్తను పంపిస్తే డెస్క్ టీం నిర్లక్ష్యం వల్ల అభాసపాలవుతున్నారు. సోషల్ మీడియాలో ఏఐ ప్రభావంతో తుమ్మల అభిమానులు ఓ చిత్రాన్ని రూపొందించి పలు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అది కాస్త ఓ పాత్రికేయ మిత్రుడు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో భారీ తుమ్మల కటౌట్ పెడుతున్నారని, ఫోటో తో సహా వార్త పంపారు. కనీసం సమాచారం తెలుసుకొని డెస్క్ సిబ్బంది ఆ చిత్రాన్ని యధాతధంగా ప్రచురించడంతో సోషల్ మీడియాలో ప్రజల మధ్య విస్తృత చర్చకు దారితీసింది. కనీస అవగాహన లేకుండా పత్రికలో ఇటువంటి సమాచారం ఇవ్వడంతో పలువురు పాత్రికేయులు ఆశ్చర్యంతో పాటు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# ఆత్మగౌరవ ర్యాలీ... రాష్ట్ర రాజకీయాల్లో అలజడి



2 లో..

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం పట్టణం ఆదివారం ఒక చరిత్రాత్మక సంఘటనకు వేదికైంది. ఎస్టీ జాబితా నుండి లంబాడి, సుగాలి, బంజారా వర్గాలను తొలగించాలని కొందరు కోర్టును ఆశ్రయించడంతో, ఈ వర్గ ప్రజలు అస్తిత్వం కోసం ఏకమయ్యారు. జేఏసీ పిలుపుతో నిర్వహించిన లంబాడీల ఆత్మగౌరవ మహా ర్యాలీ లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగే ప్రదర్శనతో ప్రారంభమైంది. సూపర్ బజార్, బస్టాండ్, ఏరియా మీదుగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ చేరిన ర్యాలీ చివరగా అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం సమర్పణతో ముగిసింది. మార్గమంతా "మా అస్తిత్వం మా హక్కు – ఎవరూ తాకలేరు", "రాజ్యాంగమే మా రక్షకుడు" అంటూ నినాదాలు మార్మోగాయి. ఈ మహా ర్యాలీకి జిల్లాలోని ప్రతి ఊరి నుండి ప్రజలు తరలివచ్చారు. వాహనాల్లో, ట్రాక్టర్లలో, బస్సుల్లో, కొందరు నడకలో కూడా చేరారు. పిల్లల నుండి వృద్ధుల వరకు, మహిళల నుండి యువత వరకు ఎవరూ వెనుకడుగు వేయలేదు. దాదాపు పది వేల మంది ఒకే వేదికపై చేరి తమ ఉనికి కోసం ఒకే స్వరం అయ్యారు. దీంతో ఇది కేవలం ఒక సాధారణ ర్యాలీ మాత్రమే కాకుండా.. ఒక సమాజం తన గౌరవం కోసం గళమెత్తిన అస్తిత్వ ప్రదర్శనగా నిలిచింది.

● మా అస్తిత్వాన్ని ప్రశ్నిస్తే... ఊరుకోబోము ● అస్తిత్వం కోసం భద్రాద్రి వీధుల్లో పది వేల గళం ● రాజ్యాంగమే మా ఆధారం – హక్కులను ఎవరూ తాకలేరు ● జేఏసీ పిలుపుతో సమైక్య శక్తి ప్రదర్శన ● కోయ సోదరుల ఆరోపణల్లో నిజం లేదని జేఏసీ స్పష్టం ● దుష్ప్రచారం చేస్తే సహించమన్న లంబాడీలు ● కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై ప్రజల ప్రశ్నలు ● రేవంత్ రెడ్డి వైఖరి సమస్య పరిష్కారం కాక విభేదాలకు కారణమని ఆరోపణ.. ● భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై ఆగ్రహం ● గిరిజన నిధుల వినియోగంపై ప్రభుత్వానికి డిమాండ్.. ● రాష్ట్ర స్థాయి నాయకుల పెద్ద ఎత్తున హాజరు

## ప్రమాదం పొంచి ఉంది..!?


- వంగిన చెట్లతో కొత్తగూడెం-ఇల్లందు క్రాస్ రోడ్ ప్రమాదకరంగా..



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి) :** కొత్తగూడెం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద రెండు దశాబ్దాలుగా పెరిగిన భారీ జామైల్ చెట్లు ఇప్పుడు రాకపోకలకు ముప్పుగా మారే అవకాశం ఉంది. వర్షాకాలం కారణంగా చెట్లు బలహీనపడటంతో అక్కడ గతంలో నాటిన జామాయిల్ చెట్లు వంగుతూ రోడ్డు మీదికి వాలిపోతున్నాయి. దీంతో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై ప్రతి రోజూ వందలాది వాహనాలు

మిగతా 6 లో...

- ప్రజాజ్యోతి కెమెరాలో చిక్కిన ఫోటో.. పోలీసుల నిర్లక్ష్యం బహిర్గతం
- జంతు రవాణా నిబంధనలు కఠినమే కానీ అమలు ఎక్కడ?
- చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ఎందుకు మౌనం?
- స్థానికుల ప్రశ్న.. పోలీసులు మత్తులోనా? లేక లాభాల్లోనా?
- జంతు హక్కుల పరిరక్షణ పుస్తకాలకే పరిమితమైందా?
- ఉన్నతాధికారుల విచారణ తప్పనిసరి..



6 లో..

# పోలీసుల అనుమతితోనే.... జంతు రవాణా జరుగుతోందా?



భద్రాద్రి కొత్తగూడెం పట్టణం ఆదివారం ఒక చరిత్రాత్మక సంఘటనకు వేదికైంది. ఎస్టీ జాబితా నుండి లంబాడి, సుగాలి, బంజారా వర్గాలను తొలగించాలని కొందరు కోర్టును ఆశ్రయించడంతో, ఈ వర్గ ప్రజలు అస్తిత్వం కోసం ఏకమయ్యారు. జేఏసీ పిలుపుతో నిర్వహించిన లంబాడీల ఆత్మగౌరవ మహా ర్యాలీ లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగే ప్రదర్శనతో ప్రారంభమైంది. సూపర్ బజార్, బస్టాండ్, ఏరియా మీదుగా పోస్ట్ ఆఫీస్ సెంటర్ చేరిన ర్యాలీ చివరగా అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రం సమర్పణతో ముగిసింది. మార్గమంతా “మా అస్తిత్వం మా హక్కు – ఎవరూ తాకలేరు”, “రాజ్యాంగమే మా రక్షకుడు” అంటూ నినాదాలు మార్మోగాయి. ఈ మహా ర్యాలీకి జిల్లాలోని ప్రతి ఊరి నుండి ప్రజలు తరలివచ్చారు. వాహనాల్లో, ట్రాక్టర్లలో, బస్సుల్లో, కొందరు నడకలో కూడా చేరారు. పిల్లల నుండి వృద్ధుల వరకు, మహిళల నుండి యువత వరకు ఎవరూ వెనుకడుగు వేయలేదు. దాదాపు పది వేల మంది ఒకే వేదికపై చేరి తమ ఉనికి కోసం ఒకే స్వరం అయ్యారు. దీంతో ఇది కేవలం ఒక సాధారణ ర్యాలీ మాత్రమే కాకుండా.. ఒక సమాజం తన గౌరవం కోసం గళమెత్తిన అస్తిత్వ ప్రదర్శనగా నిలిచింది.

# ఆత్మగౌరవ ర్యాలీ...

## రాష్ట్ర రాజకీయాల్లో అలజడి

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

● మా అస్తిత్వాన్ని ప్రశ్నిస్తే... ఊరుకోబోము ● అస్తిత్వం కోసం భద్రాద్రి వీధుల్లో పది వేల గళం ● రాజ్యాంగమే మా ఆధారం – హక్కులను ఎవరూ తాకలేరు ● జేఏసీ పిలుపుతో సమైక్య శక్తి ప్రదర్శన ● కోయ సోదరుల ఆరోపణల్లో నిజం లేదని జేఏసీ స్పష్టం ● దుష్ప్రచారం చేస్తే సహించమన్న లంబాడీలు ● కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై ప్రజల ప్రశ్నలు ● రేవంత్ రెడ్డి వైఖరి సమస్య పరిష్కారం కాక విభేదాలకు కారణమని ఆరోపణ.. ● భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై ఆగ్రహం ● గిరిజన నిధుల వినియోగంపై ప్రభుత్వానికి డిమాండ్.. ● రాష్ట్ర స్థాయి నాయకుల పెద్ద ఎత్తున హాజరు

### నాయకుల కీలక వ్యాఖ్యలు..

ఈ ర్యాలి అనంతరం వేదికపై జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మాకు ఇచ్చిన హక్కుతోనే మేము ఎస్టీలుగా గుర్తించబడ్డామని, అది సక్రమమే కానీ అక్రమం కాదని స్పష్టంచేశారు. కోయ సోదరులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇప్పటికే తెలంగాణ హైకోర్టు కూడా ఈ కేసును కొట్టివేసిందని గుర్తుచేశారు. అయినప్పటికీ మాపై దుష్ప్రచారం చేయడం వల్ల అనవసర ఉద్రిక్తతలు వస్తాయని హెచ్చరించారు. రాజకీయ లాభం కోసం కుట్రలు పన్నే వారు ఎంత ప్రయత్నించినా అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టలేరని, మనం ఏకమై ఉంటే వారి పన్నాగాలు విఫలమవుతాయని ఎస్టి సమాజానికి పిలుపునిచ్చారు. ఇది ఎవరినీ వ్యతిరేకించే పోరాటం కాదని.. కేవలం గిరిజనుల హక్కులను కాపాడుకునే సమరం మాత్రమేనని, ఈ జాతి భవిష్యత్తు ప్రశ్నార్థకమవ్వకూడదని చేస్తున్నఅంశంగా వాళ్ళు పరిగణించారు. లంబాడీలు ఎస్టీ జాబితాలో చేర్చబడినది పూర్తిగా రాజ్యాంగబద్ధమే. వారిని అక్రమంగా వచ్చారని అవమానించడం సహించేది కాదని, మా ఆత్మగౌరవం కోసం ఎంతవరకు అయినా వెళ్తామని నాయకులు హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం గిరిజనుల కోసం కేటాయిస్తున్న నిధులు పక్కదారి పట్టిస్తున్నారని, ఆ నిధులను నిజంగా గిరిజనుల అభివృద్ధికే వినియోగించాలనీ డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు వేదికపై చేసిన పలు ప్రసంగాలు ర్యాలీకి మరింత మేధో బలం చేకూర్చాయి.

### కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైకరి..

అయితే ఈ ర్యాలీ వేదికపై ఎక్కువగా వినిపించిన ప్రశ్న కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిపైది. ఒకవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా పోరాడుతుంటే, అదే పార్టీలోని ఎమ్మెల్యేలు రాజ్యాంగాన్ని విస్మరించి లంబాడీలపై కేసులు వేయడం దారుణమని ఆవేదన వ్యక్తమైంది. “రాహుల్ గాంధీ నమ్మే రాజ్యాంగం ఇక్కడ అమలవుతుందా లేదా?” అని ప్రజలు నేరుగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వైపు ఆదివాసీ నేతలతో, మరో వైపు లంబాడీ ప్రతినిధులతో సమావేశాలు జరపడం సమస్య పరిష్కారం కాదు, వాస్తవానికి సమస్యను మరింత పెంచే చర్య అని విమర్శించారు. సిఎంకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సోయం బాపూరావులను పిలిచి కేసు ఉపసంహరించుకునేలా చేయాలని, కానీ అలాంటి చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ లోని విభేదాలను బహిర్గతం చేస్తోందని నేతలు స్పష్టం చేశారు. అంతేకాదు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడైన తెల్లం వెంకట్రావే ఈ సమస్య వెనుక ఉన్నారని తమ సమాజం భావిస్తోందని అన్నారు.

### మైలురాయిగా నిలిచిన ర్యాలీ..

ఇప్పటి వరకు చిన్న స్థాయిలో నిరసనలు జరిగినప్పటికీ, ఈసారి జరిగిన మహా ర్యాలీ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. లంబాడి, సుగాలి, బంజారా వర్గాల ఏకతా శక్తిని ఇంత స్పష్టంగా చూపించిన నిరసన ఇదే. భవిష్యత్తులో జరిగే ప్రతి చర్చ, కోర్టు తీర్పులో ఈ ర్యాలీ ప్రతిధ్వనించనుందనడం అతిశయోక్తి కాదు. ఈ ర్యాలీ తరువాత ఇకపై జరిగే చర్చలు, న్యాయస్థాన తీర్పులు ఈ ఏకతా శక్తిని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాల్సిందే. ఎస్టీ జాబితాలో కొనసాగాలని ఈ వర్గాలు కోరుకోవడమే కాకుండా, సమాజంలోని తమ అస్తిత్వం నిలబెట్టుకోవాలని ఒకే వేదికపై సంకల్పించారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రజలకు భరోసా కల్పిస్తున్నప్పటికీ, ఈ ఏకతా ర్యాలీ ఆ భరోసాకు మరింత బలం చేకూర్చింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంలో జరిగిన ఈ మహా నిరసన ర్యాలీ కేవలం ఒక ఆందోళన మాత్రమే కాకుండా.. ఒక వర్గం అస్తిత్వానికి ప్రతీక, ఒక సమైక్య శక్తి ప్రదర్శన, భవిష్యత్ తరాలకు హక్కులను కాపాడే చిహ్నంగా ఇది నిలిచిపోయింది. ఈ మహా ర్యాలీకి రాష్ట్ర స్థాయి లంబాడీ సంఘాల నాయకులు, సామాజిక ప్రతినిధులు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. డాక్టర్ శంకర్ నాయక్, గుగులోత్ రాజేష్ నాయక్, భూక్యా సంజీవ్ నాయక్, బానోత్ రమేష్ నాయక్, బానోత్ హుస్సేన్ నాయక్, రమేష్ రాథోడ్, ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ తదితర నాయకులు సమైక్యంగా పాల్గొనడం, ఈ పోరాటానికి మరింత బలం ఇచ్చింది.

### రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం..

ఈ ర్యాలీ కేవలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రమే కాదు, తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపైనా ప్రభావం చూపనుంది. మొదటిగా కాంగ్రెస్ పార్టీకి ఇది పెద్ద సవాలుగా మారింది. జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పే రాజ్యాంగ పరిరక్షణ మాటలు, రాష్ట్రంలో పార్టీ ఎమ్మెల్యేల చర్యలకు విరుద్ధంగా ఉండటం, పార్టీ లోపలే విభేదాలను రేకెత్తిస్తోంది. దీంతో ఇది రాష్ట్రకాంగ్రెస్ లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తోంది. ఈ అంశం పై ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ వర్గాల సమైక్య పోరాటం వల్ల ప్రభుత్వం మరింత స్పష్టమైన వైఖరిని ప్రకటించాల్సి ఉంటుంది. లేకపోతే ఈ కాంగ్రెస్స ఆ వర్గాల నుండి తీవ్ర మైన వ్యతిరేకతను ముటగట్టుకొని ఆ నష్టాన్ని చవిచుడాల్సివస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎస్టీ వర్గాల ఏకతా శక్తి, రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ కీలకమవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హైడ్రామా లో ఇతర రాజకీయ పార్టీలు కూడా లాభనష్టాలు లెక్కిస్తున్నాయి. ఈ పోరాటం పక్కాగా ఎస్టీ వర్గాల ఓటు బ్యాంక్ ను ప్రభావితం చేయగలదని, ఆ వర్గాల ఏకతా శక్తి రాష్ట్ర రాజకీయ సమీకరణాలను మార్చగలదని వాళ్ళందరు అంచనా వేస్తున్నారు. దీనిపై కాంగ్రెస్స అధిష్టానం తొందరగా సరైన స్పష్టత ఇవ్వకపోతే తెలంగాణాలో ఆ పార్టీ కి ఈ సమాజం పూర్తిగా దూరమయ్యే సంకేతాలే స్పష్టంగా కనబడుతోంది.

### ఇంటెలిజెన్స్ అంచనాలు తారుమారు...

ఈ మహా ర్యాలీ నిర్వహణలో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రాఫిక్ లో ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేశారు. అయితే కొన్నిచోట్ల ర్యాలీ వస్తున్న దారిలోనే వాహనాలను అనుమతించడం వల్ల గందరగోళం నెలకొంది. దీంతో అక్కడి ఇన్ స్పెక్టర్ ఇన్ చార్జ్ ర్యాలీని కొంత వరకు విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ ను అనుమతించారన్న భావన కొందరిలో ఏర్పడింది. ఆ సమయంలో ఈ ర్యాలి లో పాల్గొన్న వారికి పోలీస్ తీరు కొంత ఇబ్బందిగా అనిపించింది. అదే సమయంలో పోలీసుల ఇంటెలిజెన్స్ విభాగం చేసిన అంచనాలు పూర్తిగా తారుమారయ్యాయి. కేవలం 1500–2000 మంది మాత్రమే వస్తారని ముందుగా ఊహించినా, వాస్తవానికి దాదాపు పది వేల మంది తరలి రావడంతో అధికారుల లెక్కలు తప్పిపోయాయి. అంచనాలను మించిపోయిన ఈ హాజరు ప్రజల ఏకతా శక్తిని మాత్రమే కాదు, అస్తిత్వ పోరాటానికి ఉన్న లోతైన ఆవశ్యకతను కూడా వెలుగులోకి తెచ్చింది.



# జర్నలిస్ట్ సాంబ పై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

**ఇల్లందు, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లా టీ న్యూస్ బ్యూరో వెన్నబోయిన సాంబశివరావు, కెమెరా మెన్ నాగరాజు లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు గుర్రం రాజేష్ డిమాండ్ చేశారు. ఈనెల 11న కొనిజర్లలో వార్త సేకరిస్తున్న సాంబశివరావు పై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ ఆదివారం టియుడబ్ల్యూజే (టీజేఎఫ్) ఇల్లందు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జెకె కాలనీ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని పిఏసిఎస్ వద్ద యూరియా అందక ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితిని ఈనెల 11న అడిగి తెలుసుకుంటున్న





సాంబశివరావును పోలీసులు అడ్డుకున్నారన్నారు. ఎటువంటి వివాదం లేనప్పటికీ టీ న్యూస్ బ్యూరో సాంబశివరావు, జిల్లా కెమెరామెన్ నాగరాజు, టెక్నికల్ బాధ్యునిపై కేసులు బనాయించడం దారుణం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం అందరికి తెలిసిందేనని గుర్తు చేశారు. ఆ క్రమంలో కొనిజర్ల లో కూడా యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాలను ప్రభుత్వానికి చేరవేసేందుకు బ్యూరో సాంబశివరావు ప్రయత్నం చేయడం నేరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని, తప్పులను ఎత్తిచూపుతూ వార్తలు ప్రసారం చేయడం సర్వసాధారణమే అని తెలిపారు. అయినప్పటికీ ఆ విషయాలను మరిచిన పాలకులు జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా వారిపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘ నాయకులు రాజశేఖర్, సంతోష్, డానియల్, రాధాకృష్ణ, శేషు, నందు, వీరన్న, రవి, శివ, విజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

## యువనేత రక్తదానం... మానవత్వానికి నిదర్శనం



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి:** మానవత్వమే మతమని చాటి చెప్పిన సంఘటన భద్రాచలంలో చోటు చేసుకుంది. చర్ల మండలం కుర్నపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ కోరం సమ్మక్క తీవ్ర అనారోగ్యంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు ఆమె రక్తహీనతతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉందని గుర్తించి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమని తెలపడంతో ఆమె భర్త నాగేశ్వరరావు సి పిఎం జిల్లా నాయకుడు కే. బ్రహ్మాచారిని సంప్రదించగా, వెంటనే స్పందించిన బ్రహ్మాచారి భద్రాచలం ఎస్ఎఫ్ఐ నాయకుడు కొప్పుల రవీందర్‌ను సంప్రదించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా రవీందర్ ఆసుపత్రికి చేరుకొని తన రక్తాన్ని సమ్మక్కకు దానం చేసి ప్రాణదాతగా నిలిచారు. గిరిజన మహిళకు తన అమూల్యమైన రక్తాన్ని అందించిన రవీందర్‌ను సిపిఎం జిల్లా కమిటీతో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు హృదయపూర్వ కంగా అభినందించారు. "ప్రజల కోసం చేసే సేవే నిజమైన రాజకీయ సేవ" అన్న తత్త్వాన్ని సిపిఎం శ్రేణులు ప్రతిరోజూ ఆచరిస్తూ మారుమూల గ్రామాల నుండి వైద్యం కోసం వచ్చే రోగులకు రక్తాన్ని అందించి అనేక ప్రాణాలను కాపాడుతున్నాయి. మన చిన్న సహాయం ఎవరి ప్రాణాన్నో కాపాడగలదు. ఇది సేవా కార్యక్రమం మాత్రమే కాదు, ప్రతి మనిషి మానవత్వం ప్రదర్శించాల్సిన కర్తవ్యం" అని రక్తదానం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకుడు కొప్పుల రవీందర్ పేర్కొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం అల్లాడి పౌల్ రాజ్ ఆవేదన



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి:** ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజ్ వాపోయారు. ఆదివారంస్థానిక అయ్యప్ప కాలనీలో నిర్వహించిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో జారీ చేసిన జి.ఓ. 99 ఎస్సీ వర్గీకరణ పేరుతో 58 కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను పట్టించుకోకుండా, జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీ నివేదికను అసెంబ్లీ సభ్యులందరికీ అందించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఈ వర్గీకరణ కారణంగా మాల కులంతో పాటు ఎస్సీ సమాజంలోని 58 కులాలకు విద్యలో, ఉద్యోగాల్లో, అలాగే ప్రమోషన్లలో అవకాశాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ విధానంలో కూడా ఈ కులాలకు పూర్తి స్థాయి అన్యాయం జరుగుతోందని, ఇంతవరకు ఎస్సీలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందనే భావన రాష్ట్రంలోని 40 లక్షల మాల సమాజంలో పెరుగుతోందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే కల్పించుకొని మంత్రివర్గ ఉపసంఘం ద్వారా మాల ప్రజా ప్రతినిధులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని పౌల్ రాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో శాంతిరాజు, చీకటి దసింబాబు, డేగల శివ, బర్ల రామకృష్ణ, నానిబాబు, రాజు, సామ్యూల్, కొండ, శ్రీను తదితరులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా హిందీ దివస్ దినోత్సవం



**దమ్మపేట, సెప్టెంబర్ 14, (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, దుర్గం గొల్లగూడెంలో హిందీ దివాస్ దినోత్సవాన్ని సెప్టెంబర్ 14వ తేదీన ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.కార్యక్రమంలో హిందీ భాషకు సేవలందిస్తున్న హిందీ ఉపాధ్యాయులు శ్రీ భూక్యా రమేష్, శ్రీ సపవత్ సువర్ణ కుమార్ లను ఘనంగా సన్మానించారు. వారి సేవలను గుర్తు చేస్తూ వారిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు హిందీ భా షపై వ్యాస రచనలు, ప్రసంగాలు, కవితలు చదివి హిందీ భాష ప్రాముఖ్యతను ప్రదర్శించారు. హిందీ భాష భారతదేశ ఏకత్వానికి ప్రతీకమని, దేశంలోని ప్రజల మ ధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తుందని ఉపన్యాసకులు వివరించారు. దేశ అభివృద్ధిలో హిందీ భాష యొక్క పాత్రపై వి ద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

## భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ నర్సారెడ్డి



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి:** భద్రాచలంలో ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బండారు చంద్రరావు భవన్‌లో జరిగిన భద్రాద్రి మార్బుల్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మార్బుల్ రంగం సహా నిర్మాణ రంగ కార్మికులందరూ మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నిర్మాణ కార్మికులు పనుల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి వెల్ఫేర్ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు, పనులు, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను తుంగలో తొక్కుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెల్ఫేర్ బోర్డు నిధులను పక్కదారి పట్టించడంతో అనేకమంది కార్మికుల క్లెయిములు పెం డింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.కె. జాకీ, యూనియన్ నాయకులు ఎస్.ఎం. భాష, పాల్వాయి మధు, ఎల్. సురేష్, ప్రసాద్, చంటి, వెంకటేష్, కాజా, హుస్సేన్, రాయుడు, రామావతారు, గిఫ్తార్ సింగ్, రాజు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన వనమా రాఘవ,కిలారు బృందం



**పాల్వంచ (రూరల్ ), సెప్టెంబర్ 14, ప్రజా జ్యోతి:** పాల్వంచ మండలం పరిధిలోని ఉల్వనూరు,లక్ష్మీదేవి పల్లి, రేగులగూడెం గ్రామాల్లో వనమా రాఘవ,కిలారు బృందం పర్యటించి ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించి,ఆర్థిక సహాయం అందించారు.గ్రామస్థులు సీనియర్ బిఆర్ఎస్ నాయకులు వజ్జ బాబు ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.గుండగాని అరవయ్య,కరగపల్లి దీప్తి,గుర్రం రాములమ్మ,గొగ్గల రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి స్థానిక ఎన్నికలపై చర్చించారు.

## షెడ్యూల్డ్ క్యాస్ట్ ఏరియా లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి



**చంద్రుగొండ సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం లో సిపిఎం పార్టీ స్థానిక సమస్యలు పరిష్కరించాలని సమస్య ఉన్న దగ్గరే కూర్చొని నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పెద్దిని. వేణు మాట్లాడుతూ పాలకులు నిధులు కేటాయింపు చేస్తున్నారని ఒకపక్క చెబుతూనే దళిత కాలనీలలో సమస్యలన్నీ అలాగే ఉన్నాయని అన్నారు. గుర్రాయి గూడెం రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేసినప్పటికీ డ్రైనేజీలో నుంచి చుక్క నీరు కూడా బయటకు పోవట్లేదని, వర్షం వస్తే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రాయి.రాజ పాల్గొన్నారు.

## రేపు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలకు వేలంపాట

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి:** భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో వివిధ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ స్కూటీలు, బైకులు, కార్లు తదితర వాహనాలను ఈ వేలంపాటలో ఉంచనున్నట్లు ఆమె పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు (మంగళవారం) ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి వేలంపాటలో పాల్గొనాలని సీఐ సూచించారు.

# విద్యతోనే భవిష్యత్ కాంతిమయం

- వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ ఆశాలత



చర్ల, సెప్టెంబర్ 14: (ప్రజా జ్యోతి ): చర్ల మండలంలో ఆదివారం వనవాసి కల్యాణపరిషత్ కు చర్లకు చెందిన పద్య కవి స్వర్గీయ పెద్దాడ వెంకటేశ్వరరావు – పార్వతి, ప్రమీల దంపతుల కుమార్తె తణుకు వాస్తవ్యులు ముప్పరిశెట్టి వర లక్షి – శేషారావు దంపతుల కుమారుడు హైదరాబాద్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ముప్పిరి శెట్టి జ్ఞానేశ్వర్ చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయం విద్యార్థులకు అవసరమైన వంట సామాగ్రితో పాటు విద్యార్థులకు ఒకపూట భోజనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆశాలత మాట్లాడుతూ గిరిజనుల వికాసం కొరకు వనవాసీ సంస్ద ఏర్పడిందని, సంస్ద ద్వారా గిరిజనులకు విద్య, వైద్య సౌకర్యాలను అందచేస్తున్న విషయాలను గుర్తుచేసారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్దులను అక్కున చేర్చుకొని వారికి విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలను అందిస్తోందని వివరించారు. కొమరం భీం విద్యార్దుల ప్రతిభాపాటవాలకు మంత్ర ముగ్దులై అనేక మంది దాతలు ముందుకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. హైదరాబాదులో ఉన్న జ్ఞానేశ్వర్ ఇక్కడి విద్యార్దులకు వితరణ అందచేయడం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత శ్రద్ధతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్ బాబు, కొమరం భీం విద్యార్ది నిలయం కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, కమిటి సభ్యురాలు పోలిన రమాదేవి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

- సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో మహోన్నతమైన ప్రజా పోరాటం
- విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



కొత్తగూడెం,సెప్టెంబర్ 14(ప్రజాజ్యోతి ): తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటం ప్రజాఉద్యమాలకు స్ఫూర్తి అని, ఆ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్వతంత్ర భారత దేశంలో అనేక ప్రజా, కార్మిక పోరాటాలు జరిగాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణా సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని 17వ వార్డు న్యూ గొల్లగూడెంలో జరిగిన సద్ధస్సుకు అయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. జమీందారీ, దోపిడీ, అన్యాయాలపై పేద రైతులు, కూలీలు ఏకమై పోరాడిన ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటమని ఇలాంటి మహత్తర పోరాటాన్ని కేంద్రంలోని మోడీ సర్కార్ హైజాక్ చేసేప్రయత్నాలు చేస్తోందని, ఈ పోరాటంలో బీజీపీడి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ వంట సంస్థల పాత్ర శూన్యమని అన్నారు. ప్రజా, కార్మిక హక్కులకోసం, సామాజిక న్యాయం కోసం నేడు జరుగుతున్న పోరాటాలకు తెలంగాణ సాయుధ పోరాటం మార్గదర్శకమని, నాటి సాయుధ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్ తరాలకు చైతన్యం కలిగించటం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల బాధ్యతని అన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిన సాయుధ పోరాటాన్ని విలీన దినోత్సవంగా ఎందుకు జరపలేకపోతున్నారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పోరాట చరిత్రని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని, అమరవీరుల స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ, సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని అయన డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, పురుషోత్తం, దుర్గ, అమన్, పుష్పలత, అస్మత్, ముక్త్యార్, మల్లయ్య, పి రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

## జ్వరంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకులను పరామర్శించిన పార్టీ నేతలు





దమ్మపేట, సెప్టెంబర్ 14,(ప్రజాజ్యోతి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామం ప్రకాష్ నగర్ కాలనీలో జ్వరంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు వెలుగోటి మహేష్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ నేతృత్వంలో పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు. మందలపల్లి గ్రామం, ప్రకాష్ నగర్ కాలనీ చెందిన రిపోర్టర్ భాగ్యరాజును కూడా పరామర్శించగా, అదే సమయంలో అనారోగ్యంతో ఉన్న ఆయన మాతృ మూర్తి అంజలిని కూడా కలిసి ఆరోగ్యాన్ని తెలుసుకున్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె. బుడే, మాజీ ఎంపీటీసీ శ్రీను, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు మద్దెల పుల్లారావు, కార్యదర్శి నందికొల్ల చిన్నబాబు, బలుసు గోపి, కొల్లి శేఖర్, జుజ్జురి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.పార్టీ నాయకులు మహేష్, రిపోర్టర్ భాగ్యరాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## డైలీ వేజ్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

- ఏటిఏ జనరల్ సెక్రెటరీ టి లక్ష్మీపతి



చర్ల, సెప్టెంబర్ 14:(ప్రజా జ్యోతి ): గత పది నెలలుగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైలీ వేజ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతూ మండలంలో రెండు రోజులుగా డైలీ వేజ్ వర్కర్లు జీతాల కోసం నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. వీరు చేస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఆదివారం మద్దతు తెలియచేసారు ఈ సందర్భంగా ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ టి లక్ష్మీపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్నటువంటి డైలీ వేజ్ వర్కర్స్ చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ పూర్తి మద్దతును తెలియజేస్తూ వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము అని రెగ్యులర్ వర్కర్స్ కంటే 90% పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్స్ జీతాన్ని 26,270 నుండి 11,000 కి తగ్గించడం తగదు అని అలాగే పది నెలల నుండి జీతాలు చెల్లించకపోవడం సరైనది కాదని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి అని రెగ్యులర్ వర్కర్స్ కంటే వీరు ఎంతో బాధ్యతతో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు అని నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకీ ఆకాశాన్ని అంటే విధంగా పెరుగుతున్న సందర్భంలో వీరి జీతాలను సగానికి సగం తగ్గించడం అలాగే 10 నెలల నుండి జీతాలు చెల్లించకపోవడం సరైన పద్ధతి కాదని మేము దీనికి ఖండిస్తూ వారికి సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం అని అన్నారు .సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని రాజ్యాంగం సుప్రీంకోర్టు చెబుతున్నటువంటి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని చర్ల ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ తరపున డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు .ఈ కార్యక్రమం లో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ చర్ల జనరల్ సెక్రెటరీ టి. లక్ష్మీపతి,గౌరవ అధ్యక్షులు ఎస్ శేషు పాల్గొన్నారు.

## సేవా పక్షం కార్యాశాల కార్యక్రమం

చర్ల, సెప్టెంబర్ 14:(ప్రజా జ్యోతి ):చర్ల మండలంలో ఆదివారం భారతీయ జనతా పార్టీ చర్ల మండల అధ్యక్షులు నూప రమేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనీ బీజేపీ పార్టీ కార్యాలయం లో "సేవా పక్షం కార్యాశాల" నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబా పాహీం హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్నటువంటి ఈ "సేవాపక్షం" కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని తెలియజేశారు. సెప్టెంబర్ 17 వ తారీకు న రక్తదాన కార్యక్రమం ఉన్నందున అధిక సంఖ్యలో యువత కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. సెప్టెంబర్ 18 నుండి 20 వరకు ఆత్మ నిర్భార భారత్, వికసిత భారత్ అంశాలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో చిత్రలేఖనం, స్వచ్ఛభారత్ నిర్వహించాలి అని సెప్టెంబర్ 21 నుండి 24 వరకు బీజేవైఎం ఆధ్వర్యంలో రెండు మూడు కిలోమీటర్లమేర నమో మారథాన్ చేపట్టాలి అని సెప్టెంబర్ 25,26న రోజు బూత్ స్థాయిలో మొక్కలు నాటీ దీన దయాల్ జీ కి నివాళులు అర్పించాలి అని అన్నారు . సెప్టెంబర్ 27 దివ్యాంగులకు సన్మానం సెప్టెంబర్ 28వ తారీఖున హైదరాబాదులో నిర్వహించు విశిష్ట అవార్డులు పద్మశ్రీ పద్మభూషణ్ పద్మ విభూషణ్ అర్జున అవార్డు గ్రహీతల సన్మాన వేడుకల్లో పాలుపంచుకోవాలని అక్టోబర్ రెండో తారీఖున మహాత్మా గాంధీజీ నివాళుల అర్పించి లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకి పుష్పాంజలి ఘటించాలి అని అన్నారు . ఈ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైన కార్యకర్తలకు, నాయకులకు తగు సూచన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు .గునూరి రమణ. మండల ఎంపీటీసీ ఇన్చార్జ్ ఎస్ . ధర్మరాజు. కార్యదర్శిలు. ముత్తవరపు శ్రీనివాస చారి. కుప్పా మాధవరావు. చింతూరి విశ్వనాథ. బందా మధు. మల్లెల ప్రశాంత్. సందీప్. మడకం రాజారావు .కొమరం జోగారావు. కృష్ణ. వినోద్ .సోమరాజు .తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి

- న్యూ డెమోక్రసీ నేత ముసలి సతీష్

చర్ల, సెప్టెంబర్ 14:(ప్రజా జ్యోతి ):చర్ల మండలంలో ఆదివారం గత రెండు రోజులుగా పదినెలల జీతం కోసం నిరసన చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ వర్కర్లను న్యూ డెమోక్రసీ నేత ముసలి సతీష్ కలిసి వారి సమస్యలు తెలుసుకొని వారు చేస్తున్న పోరాటం న్యాయమైనది అని వాళ్ళ డిమాండ్స్ న్యాయమైనవి అని నిరసనకు పూర్తి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్ వర్కర్లను పర్మినెంట్ టైం స్కేల్ చేయాలని అప్పటివరకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని పూర్తి కాలం పనిచేస్తున్న వారందరికీ 10నెలల పూర్తి వేతనాలను చెల్లించాలని అన్నారు . క్యాటరింగ్ జీవో 527ను రద్దు చేయాలని జీవో 60 ప్రకారం రూపాయలు 16000 జీతం చెల్లించాలని పది నెలలు పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని పీఎఫ్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.అదే విధంగా గుర్తింపు కార్డులు యూనిఫాంలు కూడా ఇచ్చి వారికి గుర్తింపు తీసుకురావాలని మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు పని కల్పించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అని లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన హాస్టల్ లో పనిచేస్తున్న వర్కర్లందర్నీ కూడగట్టి అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో వర్కర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు .



# కన్నుల పండగ గా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

- భారీ సంఖ్యలో పాల్గొన్న ముస్లిం సోదరులు




**అశ్వాపురం సెప్టెంబర్ 14 ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో జామా మసీద్ నందు ఆదివారం అబ్దుల్లా, అమీనా బి దంపతుల ఏకైక సంతానం మహమ్మద్ ప్రవక్త 1500వ జన్మదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో మండలంలోని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం జామా మసీద్ నుండి అశ్వాపురం ప్రధాన రహదారి మీదుగా గౌతమి నగర్ కాలనీ గేట్ నుండి గొందిగూడెం రోడ్డు వరకు భారీగా మహమ్మద్ ప్రవక్త నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా జామా మసీద్ మత గురువు ప్రవక్త పుట్టిన రోజు, వారి జీవనశైలి, వారి మహిమలు, యావత్ ప్రజానీకానికి వారిచ్చిన సందేశాన్ని వివరిస్తూ... సద్ మార్గంలో నడవాలని, విరివిరిగా దానధర్మాలు చేయాలని, జకాత్, ఫిత్రా, ఐదు పూటల నమాజు చేయాలని, జీవితంలో ఒక్కసారి అయినా హజ్ యాత్రలో భాగంగా మక్కాను దర్శించాలని, పర మత సహనం పాటించాలని, అందరితో సోదర భావంతో మెలగాలని, శాంతి, అహింస మార్గంలో నడవాలని, వారు ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి అమలు చేయాలని, దానివల్ల సమస్త మానవాళి సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని సూచించారు. తరువాత మండలంలోని ముస్లిం సోదరులు, మహిళలు, పిల్లలు, పెద్దలు అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో...మిలాద్ ఉన్ నబి కమిటీ సభ్యులు, జామా మసీద్ కమిటీ సభ్యులు,మత గురువులు, మత పెద్దలు, పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఐవైసి జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్
- యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం



**కొత్తగూడెం,సెప్టెంబర్ 14( ప్రజాజ్యోతి ):** బోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఓటు చోరీతో ఎన్నికల్లో గెలిచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ తీరును ఎండగట్టాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, ఉపాధ్యక్షులు గడ్డం రాజశేఖర్ అన్నారు. విద్యానగర్ లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ ఆఫీస్ లో కొత్తగూడెం అసెంబ్లీ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఓటు చోరీతో ఎన్నికల్లో గెలిచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ తీరును అందరికి అర్థం అయ్యేలా చెప్పాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న జిల్లా బాడి ఎగ్జిక్యూటివ్ సమావేశం గురించి చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజషన్ అడ్మిన్ అండ్ మీడియా సెల్ ఇంచార్జ్ మౌనిష్ గౌడ్, జిల్లా ఆర్గనైజషన్ అడ్మిన్ అండ్ లీగల్ సెల్ ఇంచార్జ్ రామ్మూర్తి, (రాము) జనరల్ సెక్రటరీ ప్రణయ్, సెక్రటరీ అశోక్, కొత్తగూడెం అసెంబ్లీ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, సంపత్, మండల ప్రెసిడెంట్లు శ్రీకాంత్, శివకుమార్, టౌన్ కొత్తగూడెం ప్రెసిడెంట్ జయసూర్య, వైస్ ప్రెసిడెంట్స్ ఉర్సు శివకుమార్, ఉస్మాన్ అలీ, జనరల్ సెక్రటరీ నర్సింగ్ పాసి, పాల్వంచ టౌన్ వైస్ ప్రెసిడెంట్ భరత్, రూరల్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, సందీప్, కోటేష్, పృథ్వి,గాయత్రీ, జీనత్ పాల్గొన్నారు.

## పని ఒత్తిడి తగ్గిస్తారా లేదా...

- ఏడో రోజుకు చేరుకున్న టిమ్స్ డ్రైవర్ల సమ్మె
- నేడు ఆర్టీసీ ఆర్ఎంతో చర్చలు జరిగే అవకాశం



**భద్రాచలం, సెప్టెంబరు 14,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఆర్టీసీ డిపో టిమ్స్ డ్రైవర్ల నిరసన రోజు రోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. ఆదివారం నాటికి ఏడు రోజుకు చేసుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఖమ్మంలో ఆర్టీసీ ఆర్ఎంతో ఈ సమస్యపై చర్చించి తగిన పరిష్కారం చూపాలని భద్రాచలం ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే గత మూడు రోజులుగా ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య భద్రాచలంలోనే ఉండి పలు దఫాలుగా టిమ్స్ డ్రైవర్లతో చర్చలు జరిపినప్పటికీ తగిన పరిష్కారం లభించలేదు. దీంతో ఆర్ఎం నేరుగా చర్చలు జరపనున్నారు. ఇప్పటికే కొన్ని రోజులు అవుట్సోర్సింగ్ సిబ్బందితో టిమ్స్ బస్సులను అంతంత మాత్రంగా నడుపుతుండటంతో ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టిమ్స్ డ్రైవర్ల సమ్మె రోజుకు రోజుకు బలపడుతుండటంతో పాటు ఆర్టీసీ జేఏసీ మద్దతు కూడగడుతున్నారు. టిమ్స్ డ్రైవర్ల డిమాండ్లు సాధారణంగానే ఉన్నప్పటికీ ఆర్టీసీ నష్టాలను ఉద్యోగులపై నెట్టి పని ఒత్తిడిని పెంచుతున్నారని టిమ్స్ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్కు మూడు మస్టర్లు ఇవ్వాలని, లేదా అదను కండక్టర్, డ్రైవరును ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై భద్రాచలం ఆర్టీసీ డీఎం ఎలాంటి స్పష్టత ఇవవ్వకపోవడంతో సమస్య రోజు రోజుకు జఠిలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నేడు ఆర్టీసీ ఆర్ఎంతో చర్చలు జరగనున్నాయి. ఒక వేళ చర్చలు విఫలమైతే సమ్మెను మరింత ముందుకు తీసుకోని వెళ్లే దిశగా అడుగులు వేయనున్నారు.

## పార్టీ కార్యకర్తకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళి



**దమ్మపేట, సెప్టెంబర్ 14,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని పట్వారి గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి నిస్వార్ధంగా సేవలందించిన కార్యకర్త చల పాక రాజు మాతృమూర్తి అమ్మాజీ పార్థివ దేహానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ ప్రాంగణంలో ప్రైవేట్ కార్యక్రమం..!

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14, ప్రజా జ్యోతి:** పట్టణంలోని తాతగుడి సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన శాఖ గ్రంథాలయంలో ఒక ప్రైవేట్ కార్యక్రమం ఆదివారం నిర్వహించడం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రజాస్వామ్య ఆస్తి అయిన ప్రభుత్వ గ్రంథాలయాన్ని ప్రైవేటు ఫంక్షన్లకు వేదికగా వాడుకోవడం పై స్థానికంగా పెద్ద చర్చ మొదలైంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, పుస్తక ప్రేమికులు, సాంస్కృతిక వర్గాలు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించడం సమంజసం కాదని మండిపడుతున్నారు. పన్నుల రూపంలో ప్రజల డబ్బుతో నిర్మించబడిన ప్రభుత్వ భవనాలు సామాన్యుల అవసరాల కోసం మాత్రమే ఉపయోగించాలి తప్ప ప్రైవేటు కార్యక్రమాలకు కాదని విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇలాంటి ప్రైవేట్ వేడుకలతో ఆ ప్రాంగణం పాడైపోతుందేమోనన్న ఆందోళన నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది.ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జిల్లా మార్కెట్ చైర్మన్ బాడీ ఎన్నిక



**చర్ల, సెప్టెంబర్ 14(ప్రజా జ్యోతి):** ఆదివారం రాష్ట్ర మార్కెట్ కమిటీ ఫోరం సభ్యులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మార్కె ట్ చైర్మన్ ల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో జిల్లా మా ర్కెట్ చైర్మన్ బాడీ ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ గా యరగర్ల హనుమంతరావు , అధ్యక్షులు గా మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహ రావు , ఉపాధ్యక్షులు గా కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ , ప్రధాన కార్యదర్శి గా సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ , కోశాధికారి గా చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావును అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

- స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎన్నికల కమీషనర్



**భద్రాచలం, సెప్టెంబరు 14,ప్రజా జ్యోతి :** భద్రాచలం లోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలో భాగంగా అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సేవలోల ఆధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన ఆర్చన, పుణ్యహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఆదేవిధంగా స్వామి వారిని రాష్ట్ర మాజీ ఎన్నికల కమీషనర్ ఐ.రాణి కుమిదిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అలాగే దేవస్థానం తరపున జ్ఞాపికను ఆలయ ఈవో దామోదర్రావు అందజేశారు.

## నేడు సబ్ కలెక్టర్, ఐటీడీఏ కార్యాలయాల్లో ప్రజావాణి

**భద్రాచలం, సెప్టెంబరు 14,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నేడు డివిజన్ లోని భూ సమస్యలపై దరఖాస్తులు అందజేయాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. అలాగే ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. ఈ దర్బార్ ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని పీవో రాహుల్ కోరారు.

## గోదావరి తీరంలో కొండచిలువ హల్చల్

- భయంతో చంపేసిన స్థానికులు



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 14, ప్రజా జ్యోతి:** భద్రాచలం గోదావరి తీరంలో స్నాన ఘట్టాల వద్ద అకస్మాత్తుగా కొండచిలువ ప్రత్యక్షమై హల్చల్ చేసింది. వరద ప్రవాహంలో కొట్టుకువచ్చిన ఈ భారీ పాము కనిపించగానే అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. చివరకు స్థానికులు దానిని చంపేశారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో గోదావరిలోనుంచి ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా భారీ విష సర్పాలు వచ్చాయని వారు వాపోయారు.

## ప్రమాదం పొంచి ఉంది..!?

(మొదటి పేజీ తరువాయి...)

స్కూల్ ఆటోలు, అంబులెన్సులు, సరకు లారీలు ప్రయాణిస్తుండటంతో ప్రాణ హాని ముప్పు మరింతగా పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే గతంలో ఇలాంటి పరిస్థితుల వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిన సందర్భాలు చోటు చేసుకున్నాయని గుర్తుచేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను అంచనా వేసి, వంగిన చెట్లను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఫారెస్ట్ శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రజలు, సామాజిక సంఘాలు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తూ... ముందే చర్యలు తీసుకుంటే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తప్పించుకోవచ్చని హెచ్చరిస్తున్నారు.

## భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగి నిలకడగా గోదావరి

**భద్రాచలం, సెప్టెంబరు 14, ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి మరోసారి స్వల్పంగా పెరిగి ప్రస్తుతం నిలకడగా కొనసాగుతోంది. శనివారం ఉదయం 8 గంటలకు 80.80 అడుగులున్న గోదావరి క్రమంగా పెరుగుతూ రాత్రి 9 గంటలకు 34 అడుగులకు చేరుకుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు 85.90 అడుగులు ఉండగా మధ్యాహ్నం 11 గంటలకు 38.20 అడుగులకు చేరుకొని అప్పటి నుంచి నిలకడగా కొనసాగుతోంది. సాయంత్రం 8 గంటల వరకు అదే స్థితిలో ఉంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరంతా భద్రాచలం మీదుగా ప్రవహిస్తోంది.

## మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక




**టేకులపల్లి, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీని ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అమెడ రవి, మండల కార్యదర్శిగా భూక్యా నాగేశ్వరరావు, కోశాధికారిగా భూక్యా రవికుమార్, జిల్లా కమిటీ సభ్యునిగా యాసం రమేష్ నాయుడు, మండల కుటుంబ భరోసా ఇంచార్జ్ గా పోతుగంటి సైదులు, గౌరవ సలహాదారునిగా అలవాల శ్రీనివాస్, యూనియన్ సభ్యులుగా నగునురి రమేష్, రవి, శ్రీకాంత్, రాజేశ్వర రావు, భూక్యా రవి, చంటి, అరుణ్, నవీన్ లను ఎన్నుకున్నారు.

## పాలడుగుల చెన్నమ్మ మృతదేహం లభ్యం

- లభించని వరలక్ష్మి ఆచూకీ







**అశ్వారావుపేట, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి :** శనివారం కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా వాగులు ఉధృతి దాల్చడంతో మండలంలోని చెన్నాపురం గ్రామంలో పత్తిపంటలో కూలికి వెళ్లి ఇద్దరు మహిళ కూలీలు గల్లంతయిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలను ఇరు రాష్ట్రాల పోలీసులు వాతావరణం అనుకూలించక పోయిన విస్తృతంగా శ్రమించారు. ఆదివారం ఉదయం నుంచి పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టగా అశ్వారావుపేట మండలంలోని అనంతారం చెక్ డ్యామ్ దగ్గర పాలడుగు చెన్నమ్మ (50) మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతుదేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో కూలి పచ్చిశాల వరలక్ష్మి ఆచూకీ కోసం ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సోమవారానికి ఆచూకీ లభించే అవకాశం ఉంటుందని ఎస్సై యయాతి రాజు తెలిపారు.

# పోలీసుల అనుమతితోనే జంతు రవాణా జరుగుతోందా?

- ప్రజాజ్యోతి కెమెరాలో చిక్కిన ఫోటో.. పోలీసుల నిర్లక్ష్యం బహిర్గతం
- జంతు రవాణా నిబంధనలు కఠినమే కానీ అమలు ఎక్కడ?
- చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ఎందుకు మౌనం?
- స్థానికుల ప్రశ్న.. పోలీసులు మత్తులోనా? లేక లాభాల్లోనా?
- జంతు హక్కుల పరిరక్షణ పుస్తకాలకే పరిమితమైందా?
- ఉన్నతాధికారుల విచారణ తప్పనిసరి..






**చుంచుపల్లి, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జంతు రవాణా వ్యవహారం పెద్ద చర్చనీయాంశంగా మారింది. రాత్రివేళల్లో జంతువులతో నిండిన ట్రక్కులు నిర్భంధం లేకుండా రోడ్లపై నడుస్తుండగా, పక్కనే పోలీసులు తమ వాహనాలతో నిలబడి ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆదివారం రాత్రి ప్రజాజ్యోతి కెమెరాలో చిక్కిన ఒక ఫోటో ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. చుంచుపల్లి పరిధిలోని బైపాస్ రోడ్డులోని పాన్ మహల్ సమీపంలో జంతువులను తరలిస్తున్న ట్రక్కు ముందు వెనకాల పోలీస్ జీపు నిలబడి ఉండటం, ఆ దృశ్యంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పోలీసు వ్యవస్థ తీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. దీంతో ప్రజల్లో "పోలీసులు ఈ అక్రమ రవాణాకు అనుమతి ఇస్తున్నారా? లేక మౌనంగా వీక్షకుల్లా నిలబడటానికి వేరే కారణాలున్నాయా?" అనే అనుమానాలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత చట్టాల ప్రకారం జంతువుల రవాణాకు కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి. ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్ 1960, ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్స్ రూల్స్ 1978 ప్రకారం జంతువులను రవాణా చేయడానికి ప్రత్యేక అనుమతులు, ఆరోగ్య సర్టిఫికేట్లు తప్పనిసరి. వాహనాల్లో గాలి, నీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోతే, జంతువులను కిక్కిరిసేలా నింపితే అది శిక్షార్హమైన నేరం. కానీ ఈ చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులే నిర్లక్ష్యం ప్రదర్శించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. స్థానికుల వాదన ప్రకారం, చుంచుపల్లి పరిధిలో జంతు రవాణా సాఫీగా సాగిపోవడం వెనుక పోలీసుల మౌన సహకారం లేకుండా సాధ్యం కాదని అంటున్నారు. పక్కనే పోలీసులు ఉండి కూడా ఎటువంటి తనిఖీలు చేయకపోవడం, వాహనాలను వదిలేయడం చూస్తుంటే "పోలీసులు మత్తులో ఉన్నారా? లేక ఈ వ్యాపారంలో లాభాలు పంచుకుంటున్నారా?" అనే ప్రశ్నలు సహజంగానే వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం కొనసాగితే జంతువుల పట్ల క్రూరత్వం పెరుగుతూనే ఉంటుంది. మరోవైపు చట్టంపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ఉన్నతాధికారులు స్వయంగా విచారణ జరిపి, నిజానిజాలు వెలికి తీయడం అత్యవసరం. ప్రజలకు హక్కులు ఉన్నట్టే జంతువులకు కూడా హక్కులు ఉన్నాయని చట్టం చెబుతున్నా, అవి పుస్తకాలకే పరిమితమైతే సమాజంలో న్యాయబద్ధత నిలబడదు. ఈ నేపథ్యంలో జంతువుల రక్షణ కోసం కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే వాస్తవం ఈ సంఘటనతో మరోసారి స్పష్టంచేస్తోంది.

## మతమన్నది మంచి మనుగడ కోసమే

- ముస్లిం సోదరులు ఆర్థికంగా నిలబడేందుకు ప్రభుత్వం సహకరిస్తుంది... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలి.. మౌలానా ముక్తి మహమ్మద్ సబీల్ సాహెబ్ ఖాస్మి (తమిళనాడు)



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 14, ప్రజాజ్యోతి:** మనిషిగా మానవత్వం చూపుతూ, మంచి మనుగడ కోసమే మతం అని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా పునః నిర్మించిన జామీమ మసీద్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే జారే ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వంలో కుల, మతాలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ముస్లిం సోదరులు ఆర్థికంగా నిలబడేందుకు ప్రభుత్వం సహాయపడుతుందని అందులో భాగంగానే మసీదు కమిటీలకు ఆర్థికంగా చేయూత అందిస్తున్నామన్నారు.



ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలి.. మౌలానా ముక్తి మహమ్మద్ సబీల్ సాహెబ్ ఖాస్మి (తమిళనాడు)

తమ జీవన విధానంలో ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని, నీతి నిజాయితీతో తోటి వారికి సహాయపడుతూ జీవించాలని మౌలానా ముక్తి మహమ్మద్ సబిల్ సాహెబ్ ఖాస్మి అన్నారు. ముస్లిం సోదరులు దేవుని ఆశీస్సులు పొందేందుకు హింస, మోసాలను విడనాడాలన్నారు.

**సహాయ సహకారం అందిస్తా.. మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

అధికారం ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరులకు అండగా, వారికి ఉంటూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ముస్లిం సోదరులు ఐక్యతతో ఉంటూ ఒకరికొకరు తోడ్పాటు అందించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పలువురు అతిథులను ముస్లిం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి రమేష్ మండల నాయకులు రేమళ్ళ కేదార్నాథ్, అల్లాడి రామారావు, టిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీ రామమూర్తి ముస్లిం కమిటీ సదర్ ఎస్.కె హోలీ పాషా యం డి నజీర్ పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.